సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ၊ 5 ၊ సెప్టెంబర్ ၊ 2023



ఇంటి యజమానులయ్యారు

నిన్నటి వరకు అద్దె ఇళ్లలో బతికిన వారు నేడు ఇంటి యజమానులయ్యారు. టిడ్కో ఇళ్లు కొత్త కేరాఫ్ ఇచ్చాయి. - IIలో



మా'స్టార్లు' వీరే

జిల్లాలో 39 మందిని ఉత్తమ టీచర్లుగా ప్రకటించారు. వీరికి మంగళవారం అవార్డులు ఇవ్వనున్నారు. - IIలో

నేడు ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ హుండీల కానుకల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి అనివేటి మండపంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ తెలియజేశారు. ఈ మేరకు ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖాధికారుల సమక్షంలోనే హుండీలను తెరిపించి లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు.

న్యూస్‌రీల్

కూర్మ గ్రామంలో రేపటి నుంచి కృష్ణాష్టమి వేడుకలు

హిరమండలం: మండలంలోని కూర్మ వైదిక గ్రామంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు కృష్ణాష్టమి వేడుకలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. దేశం నలుమూల నుంచి ఇస్కాన్ ప్రతినిధులు హాజరుకానున్నారు. పూజాది కార్యక్రమాలతో పాటు భజనలు, సంకీర్తనలు, పుష్పాంజలి, మహా హారతి, మహా ప్రసాదం, ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కృష్ణాష్టమి వేడుకల ఏర్పాట్లలో స్వచ్ఛందంగా పాల్గొనదలచుకున్న వారికి అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధులు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 7732075607, 8712701776 నంబర్లను సంప్రదించాలని కోరారు. వేడుకలకు అంతా ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



విశాఖపట్నంలో చైర్మన్ పృథ్వీతేజ్‌కు సమస్యలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్ దంపతులు

కవిటి : ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న అన్ని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. విశాఖపట్నంలోని కార్యాలయంలో సోమవారం ఏపీఈపీడీసీఎల్ చైర్మన్ పృథ్వీతేజ్‌ను కలిసి ఈ మేరకు సమస్యలపై విజ్ఞాపన పత్రాల్ని అందించారు. ప్రకృతి వైపరీత్యాలకు అధికంగా గురయ్యే కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో విద్యుత్ సమస్యలను నివారించేందుకు కన్సీల్డ్ విద్యుత్‌సరఫరా లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. కవిటిలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈదుపురంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం వినతిపత్రాన్ని అందించారు. ప్రధానంగా మున్సిపాలిటీ, నాలుగు మండలాల్లో విద్యుత్ ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలని కోరారు. వీటిపై చైర్మన్ పృథ్వీతేజ్, డైరెక్టర్లు సానుకూలంగా స్పందించారని సాయిరాజ్ తెలిపారు.

స్పందనకు 170 అర్జీలు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జేసీ ఎం.నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందనలో వచ్చిన అర్జీలను అలసత్వం లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఉప కలెక్టర్ జయదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విద్యాసాగర్‌లు అర్జీలు స్వీకరించారు. నమోదవుతున్న సమస్యలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ వారం మొత్తం 170 అర్జీలు వచ్చాయి.

పోలీసు స్పందనకు 39 అర్జీలు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారుల నుంచి 39 అర్జీలు అందాయి. ఎస్పీ జీఆర్ రాధిక ఫిర్యాదులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. ఎస్పీతో పాటు ఫిర్యాదులను స్వీకరించినవారిలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి ఉన్నారు.

పింఛను.. ఎంత మార్పు వచ్చెను!

- ఐదేళ్లలో పదిరెట్లు పెరిగిన పింఛన్ల భారం
- అర్హులందరికీ పింఛన్లు
- 3.17 లక్షలకు చేరిన పింఛన్లు
- మెడికల్ పింఛన్లు సీఎం వైఎస్ జగన్ చలవే

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఐదేళ్లలో ఎంత మార్పు..? అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే గానీ రాని పింఛన్ ఇప్పుడు సులభంగా మంజూరవుతోంది. మండల కార్యాలయానికి వెళ్లి గంటల కొద్దీ నిరీక్షిస్తే గానీ అందని పెన్షన్ డబ్బును ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. అధికారులతో పాటు నాయకులతో మాట్లాడిస్తే గానీ జరగని పని.. ఇప్పుడు వారి ప్రమేయం లేకుండానే జరుగుతోంది. ఈ ఐదేళ్లలో వచ్చిన మార్పులివి. ఐదేళ్ల కిందట జిల్లా మొత్తం రూ.7.7 కోట్లను పింఛన్ రూపంలో పంచేవారు. ఇప్పుడు ఆ మొత్తం రూ.85.87 కోట్లకు చేరింది. ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ సర్కారు ఇస్తున్న ప్రాధాన్యతను చెప్పడానికి ఈ నిదర్శనం చాలు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో జిల్లాలో పింఛన్ వ్యయం పదిరెట్లు పెరిగింది. ఒక నాడు నెలకు రూ.200లు తీసుకొనే పింఛను దారు నేడు నెలకు రూ.2,750లు తీసుకొంటున్నారు. పింఛను పెరగడంతో పాటు పింఛన్‌దారులు కూడా పెరిగారు.



బెలమర పాలవలస గ్రామ సచివాలయం వద్ద ఆనందంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్న లబ్ధిదారులు

కొత్త పింఛన్ల పండగ

పోలాకి: ప్రభుత్వం కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందజేయడంతో వారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. మండలంలో 564 మందికి పింఛన్లు వచ్చాయని మండలపరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు తెలిపారు. పింఛన్లు అందుకున్న వారంతా సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మార్పులు చూడండి



నాడు
2019 ఏప్రిల్ ముందు ఇప్పటి 30 మండలాలనే లెక్కలోకి తీసుకుంటే అన్నీ కలిపి 2,93,974 పింఛన్లు మాత్రమే ఉండేవి. ఈ పింఛన్లు గాను ప్రతి నెల కేవలం రూ. 7.70 కోట్లు ఖర్చయ్యేది.

నేడు
జిల్లాలో ప్రస్తుతం ఉన్న 30 మండలాల్లో 2023 సెప్టెంబర్ నాటికి 3,16,974 పింఛన్లు ఉన్నాయి. వీరికి నెలకు రూ.85.87 కోట్లు అందజేస్తున్నారు.



నాడు
చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఒక అర్హుడు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే పెద్ద ప్రహసనంలా ఉండేది. ఒక పింఛన్‌దారుడు మరణిస్తే గానీ ఇంకొకరికి పింఛన్ ఇచ్చేవారు కాదు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా మండల కార్యాలయాల చుట్టూ తిప్పించేవారు. జన్మభూమి కమిటీల వారు రాబందుల్లా పీక్కుతినేవారు. తమ వారు అయితేనే పింఛన్ ఇచ్చేవారు. అది కూడా నెలకు రూ.200. ఎన్నికలు వస్తున్నాయనగా పింఛన్‌ను పెంచారు.



నేడు
2019 జూన్ తర్వాత వైఎస్ జగన్ సారథ్యంలో పింఛన్ దారులకు ఠంచన్‌గా ఒకటే తేదీకే రూ.2000 ఇవ్వడం మొదలుపెట్టారు. దశల వారీగా ఆ పింఛన్ మొత్తాన్ని పెంచారు. ఇప్పటికి మూడు పర్యాయాలు పెంచారు. త్వరలో రూ.3000 ఇవ్వనున్నారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవడం కూడా సులభతరమైంది. వలంటీర్, సచివాలయ వ్యవస్థ సాయంతో అర్హులందరికీ పింఛన్ అందుతోంది.



నాడు
నాడు అభయహస్తం పింఛన్ రూ.500లు అందుకున్న వారికి విడో పింఛన్ మంజూరైతే మొదటి పింఛన్ తొలగించేవారు. రెండింటిలో ఒకటే అందుకోవాలని నిబంధన పెట్టేవారు.





నేడు
అభయహస్తం పింఛను పొందుతున్న వారిలో వితంతువులు, వికలాంగులు ఉంటే అభయహస్తంతో పాటు కొత్త పింఛన్ కూడా ఇస్తున్నారు. ఇలాంటి నిస్సహాయులకు ప్రభుత్వం సాయం చేస్తోంది.

కొత్తగా మెడికల్ పింఛన్లు..

గత ప్రభుత్వం హయాంలో మెడికల్ ఇబ్బందులు ఉన్నవారికి పింఛను లేదు. నాడు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు మాత్రమే పింఛను ఉండేది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మెడికల్ పింఛను ప్రవేశ పెట్టారు. దీని ప్రకారం కిడ్నీ రోగులు, పెరాలసిస్, తలసేమియా, హెచ్ఐవీ, సికెల్ సెల్ ఎనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా ఈ పింఛను నెలకు రూ.10 వేలు వరకు అందజేసి, వారి జీవిత కాలం పెరిగేలా ఉచిత వైద్యసేవలు అందించి ఆదుకుంటున్నారు.

కొత్తగా పింఛను వచ్చింది



నాకు ఈ నెల నుంచి కొత్తగా పింఛను వచ్చింది. ఒకటో తేదీకే ఇచ్చారు. దరఖాస్తు నుంచి పింఛను వచ్చినంత వరకు అన్ని పనులు వలంటీరే చేశారు. నాకు గతంలో అభయహస్తం పింఛను వచ్చేది. ఈ నెల నుంచి వితంతు పింఛను వస్తోంది. రెండు మొత్తాలు కలిపి నాకు రూ.3250లు అందింది. ఎంతో సంతృప్తిగా ఉంది.

– పేదాల లక్ష్మి, వాకలవలస



పింఛను రకం	కనీస వయసు	నెల పింఛను మొత్తం(రూ.ల్లో)
వృద్ధాప్యం	60	2,750
వితంతువు	18	2,750
చేనేత కార్మికులు	50	2,750
వికలాంగులు	వయసు లేదు	3,000
గీత కార్మికులు	50	2,750
అభయహస్తం	60	500
ట్రాన్స్‌జెండర్	18	3000
మత్స్యకారులు	50	2,750
ఒంటరి మహిళ	50	2,750
కిడ్నీ వ్యాధిగ్రస్తులు	వయసు లేదు	10,000
సికెడియు	వయసు లేదు	10,000
డీఎంహెచ్‌ఓ పింఛన్లు	వయసు లేదు	10 వేలు, 5 వేలు, 3 వేలు. (వ్యాధి రకం ఆధారంగా)
డప్పు కళాకారులు	50	3,000
చర్మకారులు	40	2,750
వృద్ధ కళాకారులకు	58	3000
సైనిక్ వెల్ఫేర్ పింఛన్లు	వయసు లేదు	5000

అర్హులందరికీ పింఛన్లు

జిల్లాలో అర్హులైన వారందరికీ పింఛన్లు వస్తున్నాయి. గత ఐదు నెలలుగా దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త పింఛన్లు వచ్చాయి. వారికి వెరిఫికేషన్ అయ్యాక ఈ నెలలో పింఛన్లు అందజేస్తున్నాం. వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పింఛన్లు వచ్చాయి.

– డాక్టర్ విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం



అర్ధరాత్రి గొర్రెలపై దాడి



గొంతుకోసి దగ్గర్లో ఉన్న పొదల్లో పడేసిన గొర్రె

నందిగాం: మండలంలోని కవిటి అగ్రహారంలో 15 గొర్రెలు, ఒక మేకపోతును అర్ధరాత్రి చంపి, వాటిని తరలించుకుపోయిన సంఘటనతో ఊరు ఉలిక్కి పడింది. కవిటి అగ్రహారానికి చెందిన రోణగల తవిటయ్యకు మేకలు, గొర్రెలు కలిసి సుమారు వంద వరకు ఉన్నాయి. వాటిని పగలంతా మేపుతూ రాత్రి బస్టాండ్‌కు సమీపంలో రేకు షెడ్డులో ఉంచుతుంటారు. సోమవారం ఉదయం తవిటయ్య కుమారుడు గోపాలకృష్ణ షెడ్డుకు వచ్చి చూసేసరికి షెడ్డులో పలు చోట్ల రక్తపు మరకలు కనిపించాయి. దీంతో మూగ జీవాలను లెక్కపెట్టేసరికి 15 గొర్రెలు, ఒక మేకపోతు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చుట్టు పక్కల వెదకగా పీక కోసి పొదల్లో పడేసిన గొర్రె కనిపించింది. దీంతో ఊరిలో విషయం చెప్పాడు. అంతా కలిసి ఏం జరిగిందో ఆరా తీశారు.

మటన్‌షాపులో అమ్మజూపాడు

సోమవారం వేకువజామున అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుడు ముడిమంచి మల్లేసు వజ్రపుకొత్తూరు మండలం పూండీలో ఉన్న మటన్ షాపు యజమాని గోపీకి ఫోన్ చేసి మేకపోతు అమ్ముతానని, షాపు వద్దకు రావాలని చెప్పాడు. అయితే రాత్రి వేళలో అమ్ముతాననడంతో అనుమానంతో గోపీ రాలేదు. అయితే అదే సమయంలో రాత్రి గస్తీ తిరుగుతున్న వజ్రపుకొత్తూరు పోలీసులు మల్లేసు కదలికలపై అనుమానం వచ్చి ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో గోపీ వద్దకు తీసుకెళ్లి ప్రశ్నించారు. గొర్రెపోతును తాను కొనలేదని గోపీ చెప్పడంతో మల్లేసు ఫొటో తీసి విడిచి పెట్టారు. అయితే గొర్రెలు కనిపించడం లేదనే వార్త చుట్టుపక్కల గ్రామాలకు వ్యాపించడంతో మల్లేసు పరారయ్యాడు.



పరారీలో ఉన్న నిందితుడు ముడిమంచి మల్లేసు

పోలీసులకు ఫిర్యాదు

గొర్రెల మందపై దాడి జరిగిన నేపథ్యంలో తవిటయ్య నందిగాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పోలీసులు మల్లేసు కోసం గాలిస్తున్నారు. అయితే అన్ని గొర్రెలు, మేకపోతును అతనొక్కడే చంపాడా తోడుగా ఇంకెవరైనా ఉన్నారా అన్నది తెలియరాలేదు. నాలుగు రోజుల కిందట మల్లేసు తవిటయ్య కుమారుడు గోపాలకృష్ణతో గొర్రెల కాపలా తదితర విషయాలపై ఆరా తీసినట్లు తెలిపింది. ఈ సంఘటనతో గొర్రెల కాపరులు ఆందోళన చెందుతున్నారు.

రయ్ రయ్‌మంటూ..



అడవికొత్తూరు గ్రామానికి బైక్‌పై వెళ్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మారుమూల గ్రామం అడవికొత్తూరుకు రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ద్విచక్ర వాహనంపై సోమవారం వెళ్లారు. 2వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చేరుకోవాల్సి ఉండగా వానల కారణంగా కారు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో ఆయన బైక్ నడిపి గ్రామానికి చేరుకున్నారు. 70 ఏళ్ల చరిత్రలో ఏ నాయకుడూ ఈ గ్రామాన్ని సందర్శించకపోవడం గమనార్హం. మంత్రి అక్కడి పరిస్థితి తెలుసుకుని తక్షణమే రూ.4లక్షలతో జాతీయ రహదారి మొగిలిపాడు నుంచి అడవికొత్తూరుకు 3 కిలోమీటర్లు గ్రావెల్‌రోడ్డు వేయాలని ఆదేశించారు. అనంతరం మరోవైపున కోసంగిపురం, అడవికొత్తూరు వీధులకు రూ.10లక్షలతో సీసీ రోడ్లు వేయాలని అధికారులకు ఆదేశించడంతో అడవికొత్తూరు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

'అడవి'లో.. హారతులు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 2వ వార్డులో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలు, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న అడవికొత్తూరు,కోసంగిపురం, నెమలిగ్రామం, నారాయణపురం గ్రామాల్లో మహిళలు ఆయనకు నుదుట కుంకుమ దిద్ది హారతులు పట్టారు.

–కాశీబుగ్గ

వివక్ష లేని పాలన మాది

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



నిమ్మాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

కోటబొమ్మాళి: వివక్ష లేని పాలనతో తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అందుకే అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడలోనూ అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. కోటబొమ్మాళి మండలం వాంద్రాడ, చిన్నబమ్మిడి, నిమ్మాడ జంక్షన్ గ్రామాల్లో కొత్తగా రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.61.42లక్షలతో నిర్మించిన నాడు-నేడు పాఠశాల అదనపు భవనాలు, అలాగే రూ.1.85 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల కింజరాపు కుటుంబీకుల పాలనలో వారు జిల్లాకు ఒక్క శాశ్వత ప్రాజెక్టును తీసుకురాలేకపోయారని అన్నారు. కేవలం మాటల గారడీ చేసి జనాలను మోసం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకున్నందున తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు.

వైఎస్ జగన్ సీఎం అయ్యాక పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, మంచి నీటి శుద్ధి కేంద్రం, మూలపేట పోర్టు వంటి శాశ్వత ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని అన్నారు. వేలకోట్లతో విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని తెలిపారు. భూ సర్వేతో రెవెన్యూ ,రిజిస్ట్రేషన్ల శాఖల్లో సమూల మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. అంతకుముందు చిన్నబమ్మిడి పాఠశాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విద్యా ప్రమాణాలపై పాఠశాల యాజమాన్యం తీరును మెచ్చుకున్నారు. అనంతరం ఆ స్టేజ్‌పై ధారాళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడిన చిన్నబమ్మిడి యూపీ స్కూల్ 5వ తరగతి, 9వ తరగతి విద్యార్థులు త్రిశిక, శృతిలను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయ కర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి జెడ్పీటీసీలు దుబ్బ వెంకటరావు, పాల వసంతరెడ్డి, నందిగాం, టెక్కలి ఎంపీపీలు నడుపూరు శ్రీరామమూర్తి, మట్ట సుందరమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితులు రోనంకి మల్లయ్య, సర్పంచ్ మెండ తాత, కె.అప్పన్న, వెలమల శాంతారావు, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతే లక్ష్యం



ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల ప్రగతి లక్ష్యంగా గ్రామ సచివాలయ కార్యదర్శులు పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి సంస్థ) డైరెక్టర్ జె.మురళి అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో గ్రామ కార్యదర్శుల రెండో విడత శిక్షణలో భాగంగా 200 మంది గ్రామకార్యదర్శులకు ఆరు రోజుల పునశ్చరణ తరగతులు సోమవారం ప్రారంభించారు. ఈ రెండో విడత శిక్షణను ఏపీఎస్ఐఆర్‌డీ డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు తరువాత అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యక్ష సేవలు అందుతున్నాయని అన్నారు. సచివాలయం యూనిట్‌గా అభివృద్ధి, సంక్షేమాలు జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ గ్రామాలు ప్రగతిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని చెప్పారు. ప్రజలకు పౌర సేవాపత్రం మేరకు సేవలు అందాలని అన్నారు. గ్రామాలు ప్రగతి సాధించాలంటే పంచాయతీ రాజ్ చట్టాలు సమర్థంగా అమలు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్, డీపీఓ రవికుమార్, డీపీఆర్‌సీ డీపీఎం ఎల్.లోకనాథ్ అధికారులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులు, క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించనున్నారు.

పరిశ్రమలకు వారానికో రోజు పవర్ హాలిడే

- నేటి నుంచి పది రోజుల పాటు కచ్చితంగా అమలు
- విద్యుత్ శాఖ ఎస్ఈ దైవప్రసాద్



అరసవల్లి: అధిక స్థాయి విద్యుత్ డిమాండ్, విద్యుత్ కొరత సమస్యలను అధిగమించడానికి వారానికి ఒకరోజు పరిశ్రమలకు పవర్ హాలిడే విధిస్తున్నట్లుగా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ తెలియజేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమలకు ఈనెల 5 నుంచి (మంగళవారం నుంచి) ఈనెల 15వ తేదీ వరకు షరతులతో కూడిన పవర్ హాలిడేకి ఏపీఈఆర్సీ అనుమతించినట్లుగా ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఫార్మాస్యూటికల్, మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి, బల్క్ డ్రగ్ పరిశ్రమలు తదితర పరిశ్రమల వినియోగదారులంతా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక షిఫ్ట్‌లో మాత్రమే పరిశ్రమలను నడపాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో జిల్లాలో మండలాల వారీగా పవర్ హాలిడేను విధించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేశామని, ఈ ప్రకారం అమలు చేయని పరిస్థితుల్లో ఏపీఈఆర్సీ ఆదేశాల మేరకు ఆయా పరిశ్రమల యాజమాన్యాలకు అపరాధ రుసుం విధిస్తామని పేర్కొన్నారు.

జిల్లాలో షెడ్యూల్ ఇలా

- **సోమవారం** : ఎచ్చెర్ల, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, హిరమండలం, ఎల్ఎన్.పేట, ఇచ్ఛాపురం, పాలకొండ.
- **మంగళవారం**: జి.సిగడాం, పొందూరు, కోటబొమ్మాళి, కంచిలి, వీరఘట్టం,.
- **బుధవారం**: పైడిభీమవరం, లావేరు, రణస్థలం, నందిగాం, సంతబొమ్మాళి, కవిటి, భామిని.
- **గురువారం**: శ్రీకాకుళం (డి-1,డి-2,,డి-4, గార), టెక్కలి, పాతపట్నం, సోంపేట, సీతంపేట.
- **శుక్రవారం**: శ్రీకాకుళం రూరల్, నరసన్నపేట, పోలాకి, మందస.
- **శనివారం**: జలుమూరు, సారవకోట, వజ్రపుకొత్తూరు.
- **ఆదివారం**: మెళియాపుట్టి, కొత్తూరు, పలాస-కాశీబుగ్గ

'అంకితభావంతో పనిచెయ్యండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిబద్ధత, అంకిత భావంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం కారుణ్య నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తూ కోవిడ్‌తో మృతి చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు సచివాలయాల్లోని వివిధ శాఖల్లో కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ మురళీకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పవర్ ప్లాంట్ కేసుల నుంచి విముక్తి కలిగించండి'



మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి ప్రతినిధులు

టెక్కలి: సోంపేట ప్రాంతంలో పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో భాగంగా కేసుల్లో చిక్కుకున్న వారికి విముక్తి కల్పించాలని పర్యావరణ పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావుతో పాటు మరికొంత మంది కోరారు. సోమవారం టెక్కలిలో వారు మాట్లాడుతూ సోంపేట ప్రాంతంలో బీల భూములు నాశనం చేసే విధంగా ఎన్‌సీసీ కంపెనీ పవర్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకుందని, ఈ క్రమంలో స్థానికంగా మత్స్యకారులు, ప్రజలంతా ప్రజా పోరాటం చేశారని ఆయన పేర్కొన్నారు. ఆ పోరాటంలో భాగంగా ముగ్గురు మరణించారని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో సుమారు 729 మందిపై కేసులు నమోదు చేశారని తెలిపారు. అప్పటి నుంచి కేసుల విముక్తి కోసం ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో బాధిత కుటుంబాలను పరామర్శించి ఆయా కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రజా పోరాట సంఘటనల్లో కేసుల్లో చిక్కుకున్న వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విముక్తి కలిగించారని, తమపై ఉన్న కేసులను కొట్టి వేయాలని వారంతా అభ్యర్థించారు.

గిరిజన విద్యార్థులకు ఎట్టకేలకు సర్టిఫికెట్లు

సారవకోట: జిల్లాలోని పలు మండలాలకు చెందిన గిరిజన విద్యార్థులకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు సోమవారం అండగా నిలిచారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు కాలేజీలో కోవిడ్ కాలానికి ముందు డిప్లమా కోర్సుల కోసం కొందరు విద్యార్థులు చేరారు. అయితే ఫీజులు లక్షల్లో చెల్లించాల్సిందేనని, లేదంటే సర్టిఫికెట్లు ఇవ్వబోమని ఆ కాలేజీ యాజమాన్యం చెప్పింది. ఈ విషయాన్ని విద్యార్థులు ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు దృష్టికి తీసుకురావడంతో సోమవారం యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లి శ్రీకాకుళం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కాలేజీ యాజమాన్యం దిగి వచ్చి విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసింది.

వలంటీర్ సేవా నిరతి



విశాఖలో అప్పారావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సంజయ్‌కుమార్

నందిగాం: మండలంలోని సైలాడకు చెందిన బడబందల అప్పారావు కాలు విరిగి విశాఖపట్నంలో చికిత్స పొందుతూ తన బంధువుల ఇంట ఉంటున్నారు. ఈయనకు పింఛన్ మంజూరు కావడంతో వలంటీర్ కె.సంజయ్‌కుమార్ సోమవారం తన సొంత సొమ్ములతో విశాఖపట్నం వెళ్లి అందజేశారు. సంజయ్‌కుమార్ సేవా గుణాన్ని పలువురు అభినందించారు.

ఆకట్టుకున్న జి-20 నమూనా సదస్సు



మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన నమూనా జి-20 సదస్సు

ఇచ్ఛాపురం: మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులంతా కలిసి సోమవారం జి-20 మాక్ సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం పద్మవల్లి అధ్యక్షతన విద్యార్థులు ఈ నమూనా సమావేశం నిర్వహించారు. 2023 జి-20 లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు.

ఇంటి యజమానులయ్యారు

- ఏళ్ల నిరీక్షణ అనంతరం ఇంటికి యజమానులైన పేదలు
- అద్దె కష్టాలు తప్పాయని ఆనందం
- శ్రీకాకుళం టిడ్కో ఇళ్లలో ఆనందంగా లబ్ధిదారులు
- త్వరలోనే సచివాలయం ఏర్పాటు



టిడ్కో నివాస సముదాయాల సమీపంలోని పార్కు వద్ద ఆటలాడుకుంటున్న చిన్నారులు

శ్రీకాకుళం రూరల్: బతుకంతా అద్దెలు కడుతూ, ఏళ్లకు ఏళ్లు ఇళ్లు మారుతూ గడిపేసిన సగటు జీవులు ఎట్టకేలకు ఇంటి యజమానులయ్యారు. సొంత చిరునామా అంటూ లేక ఇన్నాళ్లూ ఇబ్బంది పడిన బడుగు జీవులు శాశ్వత కేరాఫ్ అడ్రస్ సంపాదించారు. అద్దె కొంపలకు స్వస్తి పలికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన టిడ్కో ఇళ్లలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అంచెలంచెలుగా ఒక్కో కుటుంబం ప్రస్తుతం టిడ్కో ఇళ్లలో స్థిరపడుతోంది. శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలసలో 1280 టిడ్కో ఇళ్లను ప్రారంభించారు. ప్రస్తుతం 300 కుటుంబాలు అక్కడ నివాసముంటున్నాయి. వీరంతా ఇది వరకు అద్దె ఇళ్లలో నివాసం ఉన్నవారే. సీఎం వైఎస్ జగన్ దయతో సొంత ఇల్లు రావడంతో ఆనందంగా గడుపుతున్నారు.

సకల సౌకర్యాలు

ప్రస్తుతం శ్రీకాకుళం టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. తాగడానికి రెండు పూటలు మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు అన్నీ ఏర్పాటు చేశారు. నీటిని ప్యూరిఫైర్ చేసే ట్యాంక్‌లను సైతం మున్సిపల్ యంత్రాంగం అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యాపార లావాదేవీలు నిర్వహించుకునేందుకు గాను స్థానికంగానే టిఫిన్ నుంచి సాయంత్రం స్నాక్స్ వరకూ ఇక్కడే దుకాణాలు ఏర్పాటయ్యాయి.

అద్దె కొంపల నుంచి విముక్తి



నేను సి బ్లాక్ పదో నంబర్‌లో నివాసం ఉంటున్నాను. టిడ్కో ఇల్లు రాక ముందు బలగ ప్రాంతంలో రూ.3వేల అద్దెకు ఉండేదాన్ని. ఎన్నో ప్రభుత్వాలు చూశాం. చేసి చూపించిన నాయకుడు ఒక్క జగనన్న మాత్రమే. మాకు స్థిరనివాసం కల్పించారు. ఆయన రుణం తీర్చుకోలేము.

– డబ్బీరు లలిత, టిడ్కో నివాస వాసి

అన్నీ దొరుకుతున్నాయి



ఇక్కడ మొదట్లో దుకాణాలు ఉండేవి కావు. మున్సిపల్ కమిషనర్‌కు మొరపెట్టుకోవడంతో 15 షాపులు పెట్టుకోవడానికి అనుమతి ఇచ్చారు. నిత్యావసర సరుకులు నుంచి చికెన్, మటన్, బార్బర్ షాపులు, మెడికల్ స్టోర్స్, కిరాణా దుకాణాలు, గాజుల షాపులు సైతం అన్ని ఇక్కడే వెలిశాయి.

– పి.సృజనత, టిడ్కో నివాసి

సచివాలయం ఏర్పాటు చేస్తాం



మరికొద్ది రోజుల్లోనే టిడ్కో గృహ సముదాయాల వద్ద సచివాలయం ఏర్పాటు చేస్తాం. ప్రస్తుతం నగరంలో 48 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో ఒక సచివాలయాన్ని టిడ్కో వద్దకు తీసుకొచ్చేందుకు కలెక్టర్‌కు ప్రతిపాదన పెట్టాం. స్థానికంగా పెన్షన్‌లు, రేషన్‌లు అందేలా చూస్తాం. అలాగే నిర్మాణంలో ఉన్న జగనన్న మార్ట్‌ను కల్యాణ మండపంగా మారిస్తే స్థానికంగా శుభకార్యాలు చేసుకునేందుకు కూడా ఉపయోగంలోకి ఉంటుంది. దీనిపై దృష్టి పెడతాం.

– చల్లా ఓబులేసు, మున్సిపల్ కమిషనర్

రేషన్ ఇవ్వాలి



నేను జాలరి వీధిలో నెలకు రూ.4 వేలకు అద్దెకు ఉండేదాన్ని. టిడ్కో ఇంటికి మారాను. రేషన్, పెన్షన్ సదుపాయం కూడా ఇక్కడ కల్పిస్తే ఇంకా బాగుంటుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే మేం పిల్లాపాపలతో సంతోషంగా ఉన్నాం.

– ఆర్.పార్వతీ, టిడ్కో ఇంటి యజమాని

మా 'స్టార్లు' వీరే

- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 39 మంది ఎంపిక
- నేడు వారికి అవార్డుల అందజేత



శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికైన వారి జాబితాను జిల్లా విద్యాశాఖ విడుదల చేసింది. గత ఏడాది 18 మంది ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేయగా.. ఈ ఏడాది ఎక్కువ మందికి అవకాశం లభించేలా 39 మందిని ఎంపిక చేశారు. వీరికి మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం సమీపంలో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియం వేదికగా సత్కరించి, అవార్డులను, ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు హాజరు కానున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. ఎంపికైన ఉపాధ్యాయులు ఉదయం 8 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

అవార్డులకు ఎంపికైంది వీరే

పి.రేవతివల్లభరావు– హెచ్‌ఎం (జెడ్పీహెచ్‌స్కూల్ గంగువాడ, పాతపట్నం మండలం),
ఎం.లక్ష్మణరావు– హెచ్‌ఎం (జెడ్పీహెచ్‌స్కూల్ కొత్తపేట)
బి.కుమారస్వామి– హెచ్‌ఎం (మున్సిపల్ హైస్కూల్ చింతాడ, ఆమదాలవలస)
పి.శిరీష– ప్రిన్సిపాల్ (కేజీబీవీ స్కూల్ తొగ్గవలస, ఆమదాలవలస)
డాక్టర్ అన్నా శామ్యూల్– ప్రిన్సిపాల్ (ఏపీ మోడల్ స్కూల్ జి.సిగడాం)
పి.రామ్‌కుమార్ – హిందీ స్కూల్ అసిస్టెంట్ (ఎంపీయూపీస్కూల్ బైరివానిపేట, గార మండలం)
నల్ల తారకరామారావు – బయలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ (ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాతపట్నం)
శశిభూషణ గౌడ– ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ ఈదుపురం, ఇచ్ఛాపురం మండలం)
ఎస్.భుజంగరావు– ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ మెట్టూరు, కొత్తూరు మండలం)
ఎస్.ధర్మారావు – సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ (ఎంపీయూపీస్కూల్ బలద, కొత్తూరు మండలం)
ఆర్.రామారావు – హిందీ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ బెజ్జిపురం, లావేరు మండలం)
బి.చిన్నారావు – ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ నిమ్మాడ, కోటబొమ్మాళి మండలం)
డి.సుబ్రహ్మణ్యం – ఇంగ్లిష్ పీజీటీ (ఏపీమోడల్ స్కూల్, జి.సిగడాం)
సీహెచ్ శ్రీనివాసరావు – తెలుగు స్కూల్ అసిస్టెంట్ (ఎన్టీఆర్‌ఎంహెచ్‌స్కూల్ శ్రీకాకుళం నగరం)
డి.గోవిందరావు– సోషల్‌స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ (ఎంపీయూపీస్కూల్ గొల్లగండి, సోంపేట మండలం)
డి.పరమేశ్వరరావు – ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం (ఎంపీయూపీ స్కూల్ ఎకువూరు, సోంపేట మండలం)
ఎస్.లలిత – ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం (ఎంపీయూపీస్కూల్ ఇసకలపాలెం, సోంపేట మండలం)
ఐ.సంతోష్‌కుమార్ – హిందీ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ సుందరపురం, నరసన్నపేట మండలం)
టి.యశోదమ్మ – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీపీస్కూల్ బారువపేట, సోంపేట మండలం)
వసంత రాజారావు – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీస్కూల్ కల్లేపల్లి, శ్రీకాకుళం మండలం)
సీహెచ్ సురేష్‌బాబు – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ గులివిందలపేట, కొత్తూరు మండలం)
పైడి శ్యామలరావు– సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ తానెం, పొందూరు మండలం)
కె.సుహాస్ చంద్ – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ తోటవూరు, ఇచ్ఛాపురం)
చంద్రశేఖర్ బెహరా – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ తర్లకోట, పలాస మండలం)
కె.భవానీ శంకర్ – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ ఆర్ఆర్‌కాలనీ, హిరమండలం మండలం)
కింతలి చంద్రరావు – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ దనుపురం, హిరమండలం)
జె.స్వప్న – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ ఎంఎస్‌పల్లి, కంచిలి మండలం)
ఎస్.గిరిబాబు – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ ఆర్‌సీహెచ్‌కాలనీ, శ్రీకాకుళం)
ఎస్.స్వర్ణకుమారి – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ పెద్దరావుపల్లి, లావేరు మండలం)
ఎస్.మాధవరావు – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీ స్కూల్ చొర్లంగి, హిరమండలం మండలం),
డి.ఈశ్వరరావు– వ్యాయామ ఉపాధ్యాయులు (జెడ్పీహెచ్‌స్కూల్ అల్లినగరం, ఎచ్చెర్ల మండలం)
ఎం.జ్యోతిరాణి – వ్యాయామ ఉపాధ్యాయులు (జెడ్పీహెచ్‌స్కూల్ ఉర్లాం, నరసన్నపేట మండలం)
బి.శంకరరావు – వ్యాయామ ఉపాధ్యాయులు (ప్రభుత్వ ఉన్నత పాఠశాల పలాస)
బి.ఆదిశేషు – వ్యాయామ ఉపాధ్యాయులు (జెడ్పీజీహెచ్‌స్కూల్ టెక్కలి)
మంత్రి వెంకటరాజు – పీజీటీ ఇంగ్లిష్ (ఏపీ మోడల్‌స్కూల్ పాతపట్నం)
రూబెన అరుణ్‌కుమార్ – టీజీటీ (ఏపీమోడల్‌స్కూల్, లావేరు)
మంగి రమాకుమారి – పీజీటీ ఎకనామిక్స్ (ఏపీ మోడల్‌స్కూల్ లావేరు)
బీవీ సాయిరాం – మాథ్స్ స్కూల్ అసిస్టెంట్ (జెడ్పీహెచ్‌స్కూల్ కేశవరావుపేట, ఎచ్చెర్ల మండలం)
బి.శ్రీకాంత్ – సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎంపీయూపీస్కూల్ పీకెవాణిపాలెం, కవిటి మండలం)

రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ప్రకాశరావు



కె.ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న కోట ప్రకాశరావు రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్య కమిషనర్ సౌరబ్ గౌర్ ఉత్తర్వులు వెలువరించారు. ఈయన గత రెండున్నరేళ్లుగా పూర్తి అదనపు బాధ్యతలతో ఇంటర్మీడియెట్ విద్య జిల్లా వృత్తివిద్యాధికారి (డీవీఈఓ)గా వ్యవహరిస్తున్నారు. చక్కటి పనితీరుతో ఆయన గణనీయమైన ప్రగతి కనబరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు–నేడు పనులను తమ కళాశాలలో వాయువేగంతో పూర్తి చేయించారు. 2022–23 విద్యా సంవత్సరానికిగాను టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలవడంలో ప్రకాశరావు కీలక పాత్ర పోషించారు. దీంతో కోట ప్రకాశరావును రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ప్రకటించారు. విశాఖపట్నంలో జరగనున్న ఈ వేడుకల్లో ప్రభుత్వ పెద్దల చేతులమీదుగా ఆయన సత్కారం అందుకోనున్నారు. రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డుకు డీవీఈఓ కోట ప్రకాశరావు ఎంపిక కావడంపై జిల్లా ప్రిన్సిపాల్స్, లెక్చరర్ల అసోసియేషన్లు, కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్ట్ లెక్చరర్లు, పార్ట్‌టైం లెక్చరర్ల సంఘాల ప్రతినిధులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

'విశ్రాంతి' ఎరుగని మాస్టారు



శ్రీరాములు

జి.సిగడాం : తరగతి గదే ఆయనకు సర్వస్వం. విద్యార్థులే కుటుంబం. పుస్తకాలు, పాఠాలే బంధువులు. ఉపాధ్యాయునిగా పనిచేసి రిటైరైనా.. తనలోని గురువుకు ఆ కాలం చాలదని ఇంకా బోధన వృత్తిలోనే కొనసాగుతున్నారు పెంట గ్రామానికి చెందిన మక్క శ్రీరాములు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి రిటైరయ్యే వరకు శ్రీరాములు కేవలం రెండంటే రెండే సెలవులు పెట్టారంటే నమ్మి తీరాల్సిందే. దసరా, పండగ, వేసవి సెలవుల్లో కూడా విద్యార్థుల తల్లిదండ్రులను కలుస్తూ, బడికి పిల్లలను రప్పిస్తూ ఆయన పాఠాలు చెప్పేవారు. పెంట గ్రామానికి చెందిన మక్క శ్రీరాములు పాఠశాలలో 1995లో వృత్తిలో చేరారు. 2009లో జి.సిగడాం మండలానికి వచ్చారు. అప్పటి నుంచి 2021 మార్చి 31న వరకు సెలవన్నదే తీసుకోలేదు. 2021లో పదవీ విరమణ చేసినా ఇంకా పెంట యూపీ స్కూల్ విద్యార్థులకు బోధిస్తూనే ఉన్నారు. సెలవుల్లోనూ పిల్లలకు ప్రత్యేకంగా పాఠాలు చెబుతున్నారు. పాఠశాల సమయంలో ప్రతి రోజు ఉదయం 7.30 గంటలకు పాఠశాలకు వెళ్లి రాత్రి 8.30 గంటల వరకు అదనపు తరగతులు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి 4.10 గంటల వరకు తోటి సిబ్బందితో గడుపుతారు.

ఏకగ్రీవంగా ఉప సర్పంచ్‌ల ఎన్నిక

- అన్నిచోట్లా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే..



చక్క వాసుదేవరావు



లబ్బ రాజారావు

నరసన్నపేట: మండలంలోని కోమర్తి, మాకివలస, తెలగవలస పంచాయతీల్లో సోమవారం నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా ముగిసింది. మూడు పంచాయతీల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉప సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. కోమర్తిలో లబ్బ రాజారావు, మాకివలసలో చక్క వాసుదేవరావు, తెలగవలసలో కింతలి వెంకట సత్య విశ్వనాథం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉదయం 10.30 గంటలకు ఎన్నికల అధికారులు వార్డు సభ్యులను సమావేశపరిచారు. తెలగవలస, మాకివలసల్లో వార్డు సభ్యులు అధికంగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఉండటంతో పోటీ ఏర్పడలేదు. కోమర్తిలో చెరి సగం సభ్యులు రెండు పార్టీలకు ఉండగా టీడీపీ మద్దతుదారులు ఎన్నికకు హాజరుకాలేదు. ఉన్న ఐదుగురు సభ్యులకు సర్పంచ్ ఓటు కలవడంతో ఉప సర్పంచ్‌గా ప్రతిపాదించిన లబ్బ రాజారావు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఎన్నికల అధికారి ఉదయభాస్కర్ తెలిపారు. ఉప సర్పంచ్‌లుగా ఎన్నికైన వారికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అభినందించారు.



విశ్వనాథంకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి శాంతారావు

ఉపసర్పంచ్‌ల ప్రమాణ స్వీకారం..



పాతపట్నం: ప్రమాణస్వీకారం చేస్తున్న ఉపసర్పంచ్‌లు

పాతపట్నం: మండలంలోని సరాలి, చాకిపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచ్‌ల స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సరాలి ఉపసర్పంచ్‌గా యజ్జల హేమలత, చాకిపల్లి ఉప సర్పంచ్‌గా డి.కరుణ ఎన్నికయ్యారు. సోమవారం వీరు మండల పరిషత్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేశారు.

రెయ్యిపాడు ఉప సర్పంచ్‌గా రాధిక



వజ్రపుకొత్తూరు: రాధికను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

వజ్రపుకొత్తూరు: రెయ్యిపాడు పంచాయతీ ఉప సర్పంచ్‌గా కొల్లి రాధిక ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన ఎన్నికల్లో వార్డు సభ్యులంతా కలిసి ఆమెను ఎన్నుకున్నారు. ఒకటో వార్డు సభ్యురాలు వానపల్లి జానకమ్మ ప్రతిపాదించగా ఐదుగురు వార్డు సభ్యులు బలపరిచారు. ముగ్గురు వార్డు సభ్యులు ఎన్నికకు హాజరు కాలేదు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తిరుమలరావు ప్రకటించి ధ్రువపత్రం అందజేశారు.



స్వాతి

ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేట ఉపసర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారు ఎండ స్వాతి ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఒకటో వార్డు సభ్యురాలుగా ఈమె ఎన్నికైంది.

జోనంకి..



ఉపసర్పంచ్ అప్పలనాయుడును అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: జోనంకి ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. సోమవారం గంగాధరపేట సచివాలయంలో ఎన్నిక నిర్వహించారు. పది మంది వార్డు సభ్యులు ఉండగా.. ఇందులో ఐదుగురు వార్డు సభ్యులు, సర్పంచ్ ఓటుతో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు దవళ అప్పలనాయుడును ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సర్పంచ్ జీవీ రమణి తెలిపారు. టీడీపీ మద్దతుదారులు గైర్హాజయ్యారు. ఉప సర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అభినందించారు.

జిల్లుండ..



నిర్మలను అభినందిస్తున్న నాయకులు

మందస: జిల్లుండ పంచాయతీ ఉప సర్పంచ్‌గా తలగాన నిర్మల ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో ఒకటో వార్డు సభ్యురాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ నాయకులు అభినందించారు.

నాలుగేళ్ల డిగ్రీ క్లాస్‌వర్క్‌కు ఏర్పాట్లు



రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.హెచ్.ఎ. రాజేంద్రప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభిస్తున్న నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ (డిగ్రీ+బీఎడ్) క్లాస్‌వర్క్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో ఆయన సోమవారం వివరాలు వెల్లడించారు. క్లాస్‌వర్క్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో నిర్వహిస్తామని అన్నారు. విద్యార్థులకు వసతి గృహ సౌకర్యం సైతం కల్పిస్తామని అన్నారు. త్వరలో జాతీయ ఉపాధ్యాయ విద్యా ఉపాధ్యాయ మండలి కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేయనుందని చెప్పారు. ప్రభుత్వం ఈ నాలుగేళ్ల కోర్సుకు సంబంధించి 15 పోస్టులు మంజూరు చేసిందని అన్నారు. ఇందులో ఒక ప్రొఫెసర్, రెండు అసోసియేట్ ప్రొఫెసర్, 12 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయని అన్నారు. ఉన్నత విద్యా మండలి మార్గదర్శకాలను అనుగుణంగా నియామకాలు ఉంటాయని చెప్పారు. నూతన విద్యా విధానంలో ఈ కోర్సును ఎస్‌సీటీఈ డిజైన్ చేసిందని చెప్పారు. వర్సిటీలో బీఎస్సీ+బీఎడ్‌లో మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ సబ్జెక్టులు, బీఏ+బీఎడ్‌లో హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు ఉంటాయని అన్నారు. బీఎస్సీలో 50, బీఏలో 50 సీట్లతో కోర్సులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మూడేళ్లు చదివితే డిగ్రీ, నాలుగేళ్లు చదివితే డిగ్రీ+బీఎడ్ డిగ్రీ వస్తుందని అన్నారు. ఇది విద్యార్థులకు మంచి అవకాశమని చెప్పారు.

మృతుడి వివరాలు గుర్తింపు

బూర్జ: ఆమదాలవలస–దూసి రైల్వేస్టేషన్ల మధ్య ఆదివారం చనిపోయిన వ్యక్తిని పణుకుపర్త గ్రామానికి చెందిన మక్క దుర్గారావుగా గుర్తించారు. దుర్గారావు పెద్దకుమార్తె విశాఖలో నివాసముంటారు. ఆమె దగ్గరకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయి ఆయన మృతి చెందారు. జీఆర్పీ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. స్థానికులు సమాచారంతో గ్రామస్తులు పెద్ద కుమార్తెకు సమాచారం అందించగా ఆమె రిమ్స్‌కు వెళ్లి మృతదేహాన్ని చూసి తన తండ్రిదేనని గుర్తించారు. మరికొందరు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉండడంతో వారు వచ్చాక అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు.



'అవగాహన కల్పించండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకుంటే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, దీనిపై కక్షిదారులకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన సోమవారం ఆయన పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులతో జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. 9వ తేదీన జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలన్నారు.

రైలు ప్రమాద బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు



శ్రీకాకుళం పాతబస్టాండ్: రైలు ప్రమాద ఘటనలో గాయపడిన, మృతి చెందిన వారికి రూ.12 లక్షలు నష్టపరిహారం చెల్లించినట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జూన్ 2న ఒడిశా బాలాసోర్ వద్ద మూడు రైళ్ల ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన చూడిపల్లి గురుమూర్తి, తాయి అనూ గాయపడినట్లు కలెక్టర్ వివరించారు. అలాగే మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10లక్షలు, గాయపడిన ఒక్కొక్కరికి రూ.1లక్ష చొప్పున మొత్తం రూ.12లక్షల నష్ట పరిహారాన్ని బాధిత కుటుంబ సభ్యులకు కలెక్టర్ సోమవారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

సోంపేట: మండలంలోని బేసిరామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన భార్యాభర్తలు అనిల్ కుమార్ రాయ్, మనీషా రాయ్ డ్రైవర్ తంబుతో కలిసి తిరుపతి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి జార్ఖండ్ వెళ్తుండగా బేసిరామచంద్రాపురం జంక్షన్ వద్ద సోమవారం వేకువజామున ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. దీంతో వీరిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు వీరికి ఆస్పత్రికి తరలించారు. బారువ ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220